బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావును కలిసేందుకు సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం ఎర్రవల్లిలోని ఆయన నివాసానికి విచ్చేసిన ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు

పనిచేసే ప్రభుత్వాన్ని కోల్పోయాం

- తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చి, అభివృద్ధి చేసింది కేసీఆరే
- కేటీఆర్‌లాంటి ఐటీ మినిస్టర్ కష్టమే
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మద్దతుగా సోషల్ మీడియాల్లో నెటిజన్ల ట్వీట్లు
- అండగా ఉంటామంటూ ప్రకటన

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఓటమితో తెలంగాణ పనిచేసే మంచి ప్రభుత్వాన్ని కోల్పోయిందని నెటిజన్లు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజాతీర్పును శిరసావహిస్తూనే.. బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుతోపాటు పార్టీకి వెన్నంటి ఉంటామని పేర్కొంటున్నారు. ఈ మేరకు సోషల్‌మీడియాల్లో పోస్టులతో హోరెత్తిస్తున్నారు. ఆరునూరైనా గులాబీ జెండా విడిచేది లేదని బీఆర్ఎస్ అభిమానులు తేల్చి చెప్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో చావునోట్లో తలపెట్టి రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ అధినేతతోపాటు వర్కింగ్ ప్రెసిడెంట్‌కు అండగా ఉండాల్సిన బాధ్యత, సమయం ఆసన్నమైందంటూ నెటిజన్లు ట్వీట్లు చేస్తున్నారు.

కలలో కూడా ఊహించలేదు

'తెలంగాణను నిజంగా ప్రేమించే నాలాంటి వారెందరో కలలో కూడా ఊహించని ఈ చేదు నిజాన్ని జీర్ణించుకోవడం చాలా కష్టంగా ఉంది' అని ఓ నెటిజన్ ట్వీట్ చేశాడు. కేసీఆర్‌కు వెన్నుదన్నుగా నిలుద్దాం అని రాసుకొచ్చాడు. 'ప్రజా తీర్పును హుందాగా గౌరవిస్తున్నారు. బాధపడకండి.. మనం తెలంగాణ రాష్ట్ర బాగు కోసం ఎప్పటికీ పోరాడుతూనే ఉందాం. పోరాటాలు, ఉద్యమాలు మనకేం కొత్త కాదు' అని ఓ నెటిజన్ కేసీఆర్‌కు మద్దతుగా నిలిచాడు. 'నేటి ఓటమి.. రేపటి గెలుపు.. ఓడిపోయింది అభ్యర్థులే.. అభ్యర్థుల ధైర్యం ఏమాత్రం కాదు..' అని ఓ యువతి పోస్టు పెట్టింది. 'నిరంతరం శ్రమతో.. నూతన ఆలోచనలతో నా తెలంగాణ కోటి రతనాల వీణ అని చెప్పుకునే స్థితిలో నిలబెట్టిన నేతకు అండగా ఉండాలి' అని ఓ నెటిజన్ ట్వీట్ చేశాడు. 'ప్రాణమున్నంత వరకూ గులాబీ జెండా వదిలేదే లేదు. మీరు మీ శాయశక్తులా పోరాడిన తీరు అమోఘం.. నేను చాలా దగ్గరగా మిమ్మల్ని అనుసరించాను.. మీ పనితనం గ్రేట్' అంటూ మరొకరు ట్వీట్ చేశారు. 'గెలుపోటములు సహజమే అయినా.. ఉద్యమ నాయకులు కేసీఆర్, కేటీఆర్‌కు అండగా ఉండాల్సిన సమయమిది' అని ఒకరు పోస్ట్ పెట్టి మద్దతుగా నిలిచారు.

దేశంలోనే అత్యుత్తమ ఐటీ మినిస్టర్‌ను మిస్ అవుతున్నం

రాజకీయాలకతీతంగా చూస్తే భారతదేశంలోనే ఇప్పటివరకూ ఉన్న అత్యుత్తమ ఐటీ మినిస్టర్లలో ఒకరైన కేటీఆర్‌ను కోల్పోయామని దేశాయ్ అనే నెటిజన్ ట్వీట్ చేశారు. 'కేటీఆర్‌గారూ..ఇండియాలోనే ఉత్తమమైన ఐటీ మినిస్టర్ సార్ మీరు. మినిస్టర్ల గురించి మాట్లాడాల్సి వస్తే మొదట మీ పేరే వస్తుంది' అని అన్వేష్ కొండపల్లి అనే యూజర్ పోస్ట్ పెట్టారు. 'ప్రజా తీర్పును గౌరవిద్దాం.. కానీ ఐటీ మంత్రిగా మిమ్మల్ని తప్ప ఎవరినీ ఊహించుకోలేను. 5 ఏండ్లు మీ వాయిస్ మిస్ అవుతున్నది. మళ్లీ గొప్ప శక్తితో తిరిగి రండి' అంటూ శ్రీ అక్కి అనే నెటిజన్ కేటీఆర్‌కు మద్దతుగా ట్వీట్ చేశారు. నెటిజన్లందరూ ఐటీ మినిస్టర్ హ్యాష్‌ట్యాగ్‌లతో కేటీఆర్‌కు మద్దతుగా ట్వీట్లు, పోస్టుల వర్షం కురిపించారు.

ప్రపంచం మెచ్చేలా కేసీఆర్ పాలన

బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచం మెచ్చేలా పాలించారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు పేర్కొన్నారు. ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని సోమవారం తెలిపారు. పకడ్బందీ వ్యూహాలతో రాష్ట్రాన్ని సాధించటమే కాకుండా ప్రపంచంలోనే తెలంగాణకు ఇమేజ్‌ను సృష్టించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొ న్నారు. కేసీఆర్ నాయకత్వంలో సాధించిన అభివృద్ధి, సంక్షేమం ప్రపంచాన్నే అబ్బురపరిచాయని తెలిపారు. ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించడానికి గల కారణాలను లోతుగా అధ్యయనం చేస్తూ, తమ లోపాలపై సమీక్షించుకుంటామని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వానికి అభినందనలు తెలిపిన కేకే.. ఎన్నికల హామీలను అమలు దిశగా పని చేయాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు.

ఎర్రవల్లిలోని తన నివాసంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ప్రజా తీర్పును గౌరవిద్దాం

మొదటిపేజీ తరువాయి...

ఎన్నుకొందామని తెలిపారు. కేసీఆర్‌ను కలిసి వారిలో ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, మల్లారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, దానం నాగేందర్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాగంటి గోపీనాథ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, కాలే యాదయ్య, కేపీ వివేకానంద్, పాడి కౌశిక్‌రెడ్డి, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, డాక్టర్ సంజయ్, సునీతా లక్ష్మారెడ్డి, లాస్య నందిత, చింతా ప్రభాకర్, ప్రకాశ్‌గౌడ్, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, మహమూద్ అలీ, శంభీపూర్ రాజు, పట్నం మహేందర్‌రెడ్డి, ఎల్ రమణ, దండె విఠల్, మాజీ ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, సైదిరెడ్డి, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, గువ్వల బాలరాజు, బొల్లం మల్లయ్యయాదవ్, సైదిరెడ్డి, పైలట్ రోహిత్‌రెడ్డి, పద్మా దేవేందర్‌రెడ్డి, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్జెల నగేశ్ తదితరులు ఉన్నారు.

గెలుపుపత్రం అందజేత

గజ్వేల్ నియోజకవర్గం నుంచి కేసీఆర్ మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన విషయం తెలిసిందే. కాగా, ఇందుకు సంబంధించిన గెలుపు పత్రాన్ని పార్టీ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి ఈ సందర్భంగా కేసీఆర్‌కు అందజేశారు.

లోకం పోకడ

డియర్ ప్యాసెంజర్స్, మీరు ఎక్కాల్సిన హైదరాబాద్-ముంబై ఫ్లైట్ వచ్చియున్నది!

ముగిసిన ఎన్నికల కోడ్

ఎన్నికల సంఘం ఉత్తర్వులు

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసినట్టు కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) ప్రకటించింది. సోమవారం ఎన్నికల కోడ్ ముగిసిందని కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అజయ్ కుమార్ వర్మ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎన్నికల పక్రియ మొత్తం పూర్తి కావడంతో కోడ్ ఎత్తివేసినట్టు సీఈసీ ప్రకటించింది. ఎన్నికలు జరిగిన ఐదు రాష్ట్రాల్లోనూ కోడ్ ఎత్తివేస్తున్నట్టు తెలిపారు. అక్టోబరు 9న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి డిసెంబర్ 4 వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంది.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
రంగారెడ్డి	17.1°c	33.5°c
ఆదిలాబాద్	18.6°c	34.2°c
మెదక్	19.8°c	32.8°c
నిజామాబాద్	20.4°c	32.0 °c
నల్లగొండ	20.6°c	31.8°c
మహబూబ్‌నగర్	21.6°c	26.4°c
కరీంనగర్	22.0°c	28.0°c
వరంగల్	23.0°c	34.0°c
ఖమ్మం	24.0°c	28.0°c
హైదరాబాద్	22.5°c	27.5°c

గ్రాంట్‌లో కోతలు!

మొదటిపేజీ తరువాయి...

ఇవ్వకుండా కుంటి సాకులు చెప్తున్నది. ప్రతి విషయంలోనూ ఉద్దేశపూర్వకంగా కొర్రీలు పెడుతూ ఆర్థికంగా రాష్ట్రాన్ని అణగదొక్కాలని చూస్తున్నది. గ్రాంట్-ఇన్-ఎయిడ్ నిధుల విడుదలలో ఈ విషయం స్పష్టంగా అర్థమవుతున్నది. సాధారణంగా కేంద్రం రెండు రకాలుగా రాష్ట్రాలకు సాయం అందిస్తుంది. వీటిలో కేంద్ర పన్నుల నుంచి రాష్ట్రాలకు చట్టబద్ధంగా రావాల్సిన వాటా మొదటిది. రాష్ట్రాల్లో వివిధ పథకాల అమలుకు కేంద్రం ఇచ్చే గ్రాంట్-ఇన్-ఎయిడ్ రెండవది. ఈ రెండింటిలోనూ బీజేపీయేతర రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతున్నది. నామమాత్రంగా నిధులు అందించి చేతులు దులుపుకొంటున్నది. ప్రత్యేకించి గత ఆర్థిక సంవత్సరం (2022-23)లో తెలంగాణకు మొత్తంగా 31% మాత్రమే నిధులిచ్చిన మోదీ సర్కారు.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని తొలి 7 నెలల్లో 9% నిధులు మాత్రమే విదిల్చింది.

గుజరాత్‌కు అగ్ర తాంబూలం

గ్రాంట్-ఇన్-ఎయిడ్ విషయంలో బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఒక న్యాయం, మిగిలిన రాష్ట్రాలకు మరో న్యాయం అన్నట్టుగా వ్యవహరిస్తున్న కేంద్రం.. మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌కు దేశంలోనే అత్యధికంగా నిధుల వరద పారిస్తున్నది. 2023-24లో గ్రాంట్-ఇన్-ఎయిడ్ కింద గుజరాత్‌కు రూ.16,290 కోట్లు వస్తాయని ఆ రాష్ట్ర బడ్జెట్‌లో అంచనా వేయగా.. తొలి 7 నెలల్లోనే కేంద్రం ఏకంగా రూ.16,313 కోట్లు అందించింది. బీజేపీ అధికారంలో లేని తెలంగాణ, బీహార్ రాష్ట్రాలకు అంచనాల్లో 9% నిధులు మాత్రమే ఇచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 5 నెలలు మిగిలి ఉండడంతో గుజరాత్‌కు అంచనా కంటే 50% ఎక్కువ గ్రాంట్ అందవచ్చని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు.

గ్రాంట్-ఇన్-ఎయిడ్ నిధుల విడుదల ఇలా..

రాష్ట్రం	బడ్జెట్‌లో అంచనా (రూ.కోట్లలో)	గత 7 నెలల్లో కేంద్రం ఇచ్చినది (రూ.కోట్లలో)	బడ్జెట్ అంచనాలో శాతం
బీజేపీ పాలిత రాష్ట్రాలకు..			
గుజరాత్	16,290.35	16,313.33	100.14
హర్యానా	9,590.48	5,676.63	59.19
మధ్యప్రదేశ్	44,113.15	18,797.78	42.61
త్రిపుర	11,265.57	4,699.29	41.71
ఉత్తరాఖండ్	20,893.15	7,091.46	33.94
ఛత్తీస్‌గఢ్	15,000.00	4,462.43	29.75
రాజస్థాన్	33,981.74	9,599.18	28.25
అరుణాచల్‌ప్రదేశ్	4,798.00	1,142.80	23.82
ఉత్తరప్రదేశ్	1,01,203.30	20,859.04	20.61
మిజోరం	4,398.08	851.05	19.35
అస్సాం	45,121.31	8,557.15	18.96
మహారాష్ట్ర	62,647.02	11,269.09	17.99
బీజేపీయేతర రాష్ట్రాలకు..			
తెలంగాణ	41,259.17	3,835.91	9.30
బీహార్	53,377.92	5,033.03	9.43
సిక్కిం	3,306.37	558.01	16.88
మిజోరం	4,398.08	851.05	19.35
జార్ఖండ్	16,438.42	3,384.42	20.59
పంజాబ్	20,735.08	4,726.60	22.80
మేఘాలయ	7,632.59	1,872.08	24.53
పశ్చిమ బెంగాల్	40,821.06	11,064.14	27.10
కేరళ	15,866.03	4,441.07	27.99
ఒడిశా	32,748.82	9,298.59	28.39
కర్ణాటక	18,005.00	6,785.08	37.68
నాగాలాండ్	8,018.82	3,398.70	42.38
తమిళనాడు	27,444.64	11,861.20	43.22
ఆంధ్రప్రదేశ్	46,834.64	21,892.12	46.74
హిమాచల్‌ప్రదేశ్	13,048.68	7,890.11	60.47

నూతన ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలతో హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో సమావేశమైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు

మన అడ్డా తెలంగాణ భవన్

- ఇకపై ఇక్కడ అందుబాటులో ఉంటాం
- పది సంవత్సరాల పాలనలో బీఆర్ఎస్ అద్భుతాలు సృష్టించింది
- ప్రతిపక్ష పాత్రను కూడా అంతే స్ఫూర్తితో నిర్వహిద్దాం
- త్వరలోనే విస్తృతస్థాయి సమావేశం
- ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలతో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణ భవన్ కేంద్రంగా ప్రజలకు అందుబాటులో ఉంటామని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గెలిచిన ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలతో కేటీఆర్ సమావేశం అయ్యారు. ఎమ్మెల్యేలుగా గెలిచినవారిని ఆయన అభినందించారు. పదేండ్లలో బీఆర్ఎస్ పార్టీ అద్భుతమైన కార్యక్రమాలు చేపట్టిందని చెప్పారు. ప్రజలు ఇంకో పార్టీకి అవకాశం ఇచ్చినా, బీఆర్ఎస్ పార్టీకి గౌరవప్రదమైన స్థానాలను కట్టబెట్టారని తెలిపారు. ప్రజలు ఇచ్చిన ప్రతిపక్ష పార్టీ బాధ్యతను విజయవంతంగా నిర్వహిద్దామని చెప్పారు. ఎన్నికల తర్వాత ప్రజల నుంచి పార్టీ నాయకత్వంపైనా సానుకూలత స్పందన వస్తున్నదని, బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోతుందని అనుకోలేదని సమాజంలోని అన్ని వర్గాల నుంచి వేలాది మేసేజ్‌లు వస్తున్న విషయాన్ని వారంతా కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు.

త్వరలో విస్తృతస్థాయి సమావేశం

ఎన్నికైన ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలతో త్వరలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు కేటీఆర్ పేర్కొన్నారు. సమావేశంలో అన్ని విషయాలు కూలంకషంగా చర్చించి, కార్యాచరణ రూపొందించుకొని ముందుకు సాగుతామని చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు సచివాలయం, ప్రగతిభవన్ కేంద్రంగా విధులు నిర్వహించిన తామంతా ఇకపై తెలంగాణభవన్ కేంద్రంగా ప్రజలకు అందుబాటులో ఉంటామని చెప్పారు. ఈ సమావేశంలో తాజా మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్, సత్యవతి రాథోడ్, ఎంపీలు రంజిత్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, పోతుగంటి రాములు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కేపీ వివేకానంద, అరికెపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్ తదితర ఎమ్మెల్యేలతోపాటు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ ముఖ్యనేతలు, పోటీచేసిన పలువురు నాయకులు పాల్గొన్నారు. కాగా, పార్టీ అధినేత కేసీఆర్ తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో ఆయా కార్పొరేషన్లకు చైర్మన్లుగా వ్యవహరిస్తున్న వారంతా తమతమ పదవులకు రాజీనామా చేయాలని నిర్ణయించుకొని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తమ రాజీనామాపత్రాలను పంపారు.

బీఆర్ఎస్‌ను వీడుతున్నట్టు అసత్య ప్రచారం

- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- దుష్ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు

నర్సాపూర్, డిసెంబర్ 4: తాను బీఆర్ఎస్‌ను వీడే ప్రసక్తే లేదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆమె ఖండించారు. సోమవారం ఆమె నర్సాపూర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కొందరు పని గట్టుకొని తనపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌లోనే ఉంటూ ప్రజాసేవ చేస్తానని పేర్కొన్నారు. తనను ఆదరించి విజయాన్ని కట్టబెట్టిన ప్రజలకు, బీఆర్ఎస్ కార్యకర్తలకు జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు. తనపై అసత్య ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఆమె పేర్కొన్నారు.

నేను బీఆర్ఎస్‌ను వీడటం లేదు

- పార్టీ అధినేత కేసీఆర్ వెంటే నడుస్తా
- సోషల్ మీడియా ప్రచారంలో వాస్తవం లేదు
- భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

ఖమ్మం, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): తాను పార్టీ మారడం లేదని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు స్పష్టం చేశారు. పార్టీ మారుతున్నట్టు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని తేల్చిచెప్పారు. తాను రేవంత్‌రెడ్డితో ఉన్న పాత ఫొటోను కొందరు వ్యక్తులు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని, సోషల్ మీడియాలో వస్తున్నదంతా అబద్ధమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పనిచేస్తానని తేల్చిచెప్పారు. సోమవారం ఆయన ఖమ్మం నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తనకు టికెట్ ఇచ్చి గెలిపించిన పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు పాదాభివందనం చేస్తున్నానని అన్నారు. ఓటు వేసి గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎంగా కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తనను గెలిపించినట్టు స్పష్టం చేశారు. ఏజెన్సీలో ఉన్న ప్రధానమైన పోడుభూముల పట్టాల సమస్యను కేసీఆరే తీర్చారని గుర్తుచేశారు. రైతుబంధు సహా అనేక పథకాలను అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. పార్టీ అధినేత కేసీఆర్ పట్ల విశ్వాసంగా ఉంటానని, జీవితం ఉన్న వరకు తాను కేసీఆర్‌తోనే నడుస్తానని స్పష్టం చేశారు. గిట్టనివారు ఉద్దేశపూర్వకంగా తనపై చేస్తున్న ఈ దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. గతంలో కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులతో దిగిన ఫొటోను ఇప్పుడు కొంతమంది గిట్టని వారు ఉద్దేశపూర్వకంగానే వైరల్ చేస్తున్నారని ఆరోపించారు. ఇలా తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై ఇప్పటికే ఏసీపీకి సైతం ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు.

నామినేటెడ్ పోస్టులకు రాజీనామా

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కార్పొరేషన్ల చైర్మన్ల లేఖలు
- రాష్ట్ర పునర్నిర్మాణంలో అవకాశం కల్పించిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టులకు ఎంపికైన పలువురు రాజీనామాలు చేశారు. వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు కూడా అదేబాట పట్టారు. తమ రాజీనామా లేఖలను సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి పంపించారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ సర్కారు నామినేటెడ్ పోస్టుల్లో పలువురిని నియమించింది. కాంగ్రెస్ నేతృత్వంలో రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటవుతున్న నేపథ్యంలో నామినేటెడ్ పోస్టులకు, పలు కార్పొరేషన్ల చైర్మన్ పదవులకు వారు రాజీనామాలు చేశారు. తెలంగాణ పునర్నిర్మాణంలో తమకు అవకాశం కల్పించిన కేసీఆర్‌కు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలియజేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలకు అనుగుణంగా రానున్న రోజుల్లో పని చేస్తామని ప్రకటించారు.

రాజీనామాలు చేసినవారు	హోదాలు
బోయినపల్లి వినోద్‌కుమార్	ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు
డాక్టర్ కేవీ రమణాచారి	బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు చైర్మన్
దేవులపల్లి ప్రభాకర్‌రావు	ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ
కోలేటి దామోదర్	పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్
టీ ప్రభాకర్‌రావు	యాంటి నక్సల్ ఇంటెలిజెన్స్ వింగ్, ఓఎస్డీ
జే రామచందర్‌రావు	రాష్ట్ర అదనపు అడ్వొకేట్ జనరల్
దూదిమెట్ల బాలరాజు	గొర్రెలు, మాంసాభివృద్ధి సంస్థ చైర్మన్
గెల్లు శ్రీనివాస్‌యాదవ్	పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్
పల్లె రవికుమార్	గీత వృత్తిదారుల సహకార సంస్థ చైర్మన్
సోమా భరత్‌కుమార్	టీఎస్ డీడీసీ చైర్మన్
జూలూరు గౌరీశంకర్	సాహిత్య అకాడమీ చైర్మన్
అయాచితం శ్రీధర్	గ్రంథాలయ పరిషత్ చైర్మన్
రవీందర్‌సింగ్	సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్
కే వాసుదేవరెడ్డి	వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్
అనిల్ కూర్మాచలం	ఎఫ్‌డీసీ చైర్మన్
మన్నె క్రిశాంక్	టీఎస్ఎండీసీ చైర్మన్
పాటిమీద జగన్‌మోహన్‌రావు	టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్
గజ్జెల నగేశ్	బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్
మేడె రాజీవ్‌సాగర్	టీఎస్ ఫుడ్స్ చైర్మన్
ఆంజనేయగౌడ్	సాట్స్ చైర్మన్
వై సతీశ్‌రెడ్డి	రెడ్‌కో చైర్మన్
రామచంద్రునాయక్	ట్రైకార్ చైర్మన్
గూడూరు ప్రవీణ్	టెక్స్‌టైల్ కార్పొరేషన్ చైర్మన్
వాల్యా నాయక్	జీసీసీ చైర్మన్